

హరినగర్‌లో రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

హరినగర్‌లో రోడ్డు పనులు పూర్తి చేయాలి

రాంనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని హరినగర్‌లో పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం జరిగితే కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానని ఆయన అధికారులను హెచ్చరించారు. సోమవారం రాంనగర్ హరిగనగర్‌లో రోడ్డు సమస్యను స్థానికుల ఫిర్యాదు మేరకు ఆయన స్పందించి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరినగర్ అబ్బసాయి మెన్షన్ నుంచి ఎస్సార్టీ పార్కు వరకు రోడ్డు నిర్మాణం కోసం తవ్వకాలు జరిపి నెలరోజులైనా నిర్మాణం ఎందుకు పూర్తి చేలేదని అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో ముఠా జైసింహ, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్, కేశపురం అరుణ్, ముదిగొండ మురళీ, కొండమడుగు మదు, ఎర్రం శేఖర్, ముక్తార్ హుస్సేన్, గోక నవీన్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి'

ముషీరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ శ్రేణులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ తెలంగాణ భవన్ ఇన్‌చార్జి మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం తెలంగాణ భవన్ ఇన్‌చార్జిగా పదవీ విరమణ చేసిన మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ ఆధ్వర్యంలో ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచేది బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దీన్‌దయాల్‌రెడ్డి, గాంధీనగర్, భోలక్‌పూర్, ముషీరాబాద్ బీఆర్ఎస్ అధ్యక్షులు రాకేష్‌కుమార్, వై.శ్రీనివాస్‌రావు, శ్రీధర్‌రెడ్డి, నాయకులు అరుణ్, శ్రీనివాస్, నానీ తదితరులు పాల్గొన్నారు.



దీపక్‌జాన్‌ను మెమెంటో అందజేసి సత్కరిస్తున్న పాస్టర్స్

క్రైస్తవులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గోల్నాక, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమం కోసం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్ సూచించారు. సోమవారం గోల్నాక డివిజన్ అన్నపూర్ణనగర్‌లోని బేతేల్ గాస్పెల్ చర్చిలో అంబర్‌పేట నియోజకవర్గం పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రెవరెండ్ జి.వరకుమార్ అధ్యక్షతన జరిగిన మూడో వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా దీపక్‌జాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని తెలిపారు. అలాగే విదేశాల్లో చదువుకోవడానికి ఆర్థిక సాయం అందజేస్తుందని వివరించారు. కార్యక్రమంలో బిషప్ కె.సుధాకర్, కె.జోషఫ్‌రాజ్, వల్లబాయ్, పాస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ జీవితం-ఆశయం'పై స్మారకోపన్యాసం 6న

బర్కత్‌పుర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 6వ తేదీన 'అంబేడ్కర్ జీవితం-ఆశయం' అనే అంశంపై స్మారకోపన్యాసం నిర్వహిస్తున్నట్లు మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె.లింగయ్య, ప్రధాన కార్యదర్శి జి.జ్ఞానేశ్వర్‌లు పేర్కొన్నారు. సోమవారం బర్కత్‌పురలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 6న సాయంత్రం 6 గంటలకు ఈ స్మారకోపన్యాసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు.

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



అదనపు డీసీపీ నర్సయ్య

రాంనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, దీనికోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని ఈస్ట్ జోన్ అదనపు డీసీపీ నర్సయ్య సూచించారు. బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని డీడీ కాలనీకి చెందిన ప్రైవేటు స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ డే కార్యక్రమానికి సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఉందన్నారు. ఆటపాటల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రూపారెడ్డి, ఆపరేషన్స్ డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ సులక్షణ, యామినితో పాటు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న డిప్యూటీ డీఈవో విజయలక్ష్మి

క్రీడలతో మానసిక ఉల్లాసం

బర్కత్‌పుర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని హిమాయత్‌నగర్ ఎడ్యుకేషన్ జోన్ డిప్యూటీ డీఈవో విజయలక్ష్మి అన్నారు. సోమవారం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఎడ్యుకేషన్ జోన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హైదర్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో ఈ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న అంబేడ్కర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

విద్యార్థులు హెచ్ఐవీ గురించి అవగాహన కలిగి ఉండాలి

రాంనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు హెచ్ఐవీ గురించి అవగాహన కలిగి ఉండాలని అంబేడ్కర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విష్ణుప్రియ సూచించారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో హెచ్ఐవీ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విష్ణుప్రియ పాల్గొని మాట్లాడారు. హెచ్ఐవీ రోగనిరోధక వ్యవస్థపై దాడి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, డైరెక్టర్, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

పడకంటి బ్రహ్మాచారి మృతికి ప్రముఖుల సంతాపం



బ్రహ్మాచారి(ఫైల్)

అంబర్‌పేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నేత పడకంటి బ్రహ్మాచారి(65) మృతి పట్ల హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ల సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం గుండెపోటుతో బ్రహ్మాచారి మృతి చెందారు. శనివారం రాత్రి ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబసభ్యులకు నాంపల్లిలోని కేర్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం 8 గంటలకు మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పడకంటి బ్రహ్మాచారి మరణవార్త తెలియగానే బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నేతలు అంబర్‌పేట డివిజన్ నరేంద్రనగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి బ్రహ్మాచారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఫీజు బకాయిలు చెల్లించకుండా విజయోత్సవాలా?

విద్యార్థుల దీక్షా శిబిరంలో మాజీ ఎంపీ ఆర్ కృష్ణయ్య



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, పక్కన వేముల రామకృష్ణ , వెంకటేష్ తదితరులు

రాంనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన 16.75 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్, ఫీజులు నాలుగు వేల కోట్ల రూపాయలు చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలు నిర్వహించడం సిగ్గు చేటని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య విమర్శించారు. విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో 'విద్యార్థుల ఫీజులదీక్ష' సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. సీఎం రేవంతర్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థుల ఫీజు బకాయిలకు సంబంధించి ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతూ ప్రభుత్వం విజయోత్సవాలు చేసుకోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. విద్యా వ్యవస్థను ప్రభుత్వం నీరు గార్చే చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఫీజు బకాయిలు చెల్లించకుండా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలో ఉద్దేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఫీజుల జాప్యం కారణంగా కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలు స్పందించి ఫీజు బకాయిలను విడుదల చేసి విజయోత్సవాలను జరుపుకోవాలని సూచించారు. ఈ దీక్షకు అధ్యక్షత వహించిన వేముల రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులపై ప్రభుత్వానికి ఏమాత్రం ప్రేమ ఉన్నా వెంటనే ఫీజు బకాయిలు విడుదల చేయాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ దీక్షలో బీసీ సంఘాల నేతలు ప్రతినిధులు నీల వెంకటేష్, సి రాజేందర్, జి అనంతయ్య, నందగోపాల్, సుధాకర్, ఉదయ్, మధుసూదన్, రవికుమార్‌యాదవ్, అరవింద్ పృథ్విగౌడ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

గోల్నాక, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): గోల్నాక తులసీనగర్‌కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా 18 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.5 లక్షలా 65 వేల విలువైన చెక్కులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం పేద ప్రజలకు వరంలా మారిందన్నారు. ఎ.సురేష్‌గౌడ్, వై.బుచ్చిరెడ్డి, కొంపల్లి లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.



మంత్రి పొన్నంను కలిసిన కేకేసీ ప్రతినిధులు

ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

బర్కత్‌పుర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని అఖిల భారత అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసీ) రాష్ట్ర చైర్మన్ కౌశల్‌సమీర్, ప్రధాన కార్యదర్శి పి.సంపత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్‌లు కోరారు. సోమవారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ఆటోడ్రైవర్ల సమస్యలను విన్నవించినట్లు వారు తెలిపారు. డ్రైవర్ల ఆర్థిక సహాయాన్ని 12 వేల రూపాయలను వెంటనే ఇవ్వాలని, బైక్ ట్యాక్సీని నిషేధించాలని, ఆటో మీటరు చార్జీలను 12 నుంచి 20 రూపాయలకు పెంచాలని కోరారు. ఓలా, ఉబర్ రాపిడోలను నిషేధించాలని, ఆటో పర్మిట్‌లను రీప్లేస్ చేయాలని, కొత్త ఆటోలకు పర్మిట్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు డి.సత్యనారాయణ, ఎం.శివ, మహ్మద్‌ఫారుఖ్ తదితరులు పాల్గొన్నారు.

● రోడ్డుపై గుంత



గోల్నాక చౌరస్తా నుంచి కొత్తబ్రిడ్జి వైపువెళ్లే ప్రధాన రోడ్డు మధ్యలో వాటర్‌పైపు లీకేజీ కారణంగా పెద్ద గుంతపడి ప్రమాదకరంగా మారింది. అంబర్‌పేట ఫ్లై ఓవర్ నిర్మాణం, మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జి పనులతో ట్రాఫిక్ మళ్లింపుతో ఈ రోడ్డు రద్దీగా మారింది. పైగా వాటర్‌పైపు లీక్ అయి రోడ్డుపై గుంతపడడంతో ప్రమాదబరితంగా మారింది. ద్విచక్రవాహనదారులు వేగంగా రావడంతో వారికి గుంత కనబడక అదుపుతప్పి కిందపడిపోతున్నాయి. ఈ విషయం గురించి అధికారులకు, ప్రజాప్రతినిధులకు వివరించినా ప్రయోజనం లేకుండా పోతుందని స్థానికులు వాపోతున్నారు.

- గోల్నాక, డిసెంబర్ 2 ఆంధ్రజ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

కుష్ఠు పట్ల అప్రమత్తంగా ఉండాలి

కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి అన్నారు. ఈ నెల 15 వరకు 13 రోజుల పాటు జరగనున్న కుష్ఠు బాధితుల గుర్తింపు ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. సోమవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. కుష్ఠు సమస్యతో బాధపడుతున్న వారు తమ పేర్లను నమోదు చేసుకుని చికిత్స పొందాలని కోరారు. కుష్ఠుతో బాధపడేవారిని చిన్నచూపు చూడొద్దని తెలిపారు. క్రమం తప్పకుండా మందులు వాడితే సమస్య త్వరలో తీరిపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, డీఎల్‌వో డాక్టర్ ఎస్.మురళీధర్, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ వనిత, కె.శ్రీనివాస్‌రెడ్డి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

● నివాళి



మాజీ సీఎం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి 20వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఇందిరాపార్కులోని మర్రి చెన్నారెడ్డి సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించిన మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్ తదితరులు

- నల్లకుంట, ఆంధ్రజ్యోతి

ఘంటసాల గుడికి అపురూప చిత్రపటం అందజేత



రామరాజుకు చిత్రపటాన్ని అందజేస్తున్న రామకృష్ణ

చిక్కడపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత నటులు అక్కినేని నాగేశ్వరరావు, నందమూరి తారక రామారావులతో ప్రఖ్యాత గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు కలిసి ఉన్న చిత్రపటాన్ని కుంట్లూరులో ఉన్న ఘంటసాల దేవాలయం ధర్మకర్త వంశీ రామరాజుకు అక్కినేని, రామారావు, ఘంటసాల అభిమాని గంటి రామకృష్ణ త్యాగరాయగానసభలో సోమవారం అందజేశారు. ఘంటసాల జయంతి సందర్భంగా అపురూప చిత్రపటం ఘంటసాల గుడి కోసం అందజేసినందుకు రామకృష్ణకు వంశీ రామరాజు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తులపై దృష్టి సారించాలి: కలెక్టర్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. గ్రీవెన్స్‌సెల్‌లో వివిధ సమస్యలపై 332 మంది దరఖాస్తు చేసుకున్నారు. డీఆర్వో వెంకటాచారి, ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరాం, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీలో 132 దరఖాస్తులు

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు ఆరు జోన్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 132 దరఖాస్తులు వచ్చాయి. జీహెచ్ఎంసీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగానికి 17, ఏసీ రెవెన్యూ అడ్మిన్‌కు 4, సీఈ మెయింటనెన్స్, వెటర్నరీ, ఎల్ఏకు 3, శానిటేషన్, హెల్త్, యూబీడీసీఈ ప్రాజెక్టుకు-1 అర్జీలు చేసుకున్నారు. అలాగే ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 6 వచ్చాయి. మరికొన్ని విభాగాలకు దరఖాస్తులు అందజేశారు. కాగా, వీటితో పాటు జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 94 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

మందకృష్ణ మాదిగ వాస్తవాలు తెలుసుకోవాలి



ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న బేర బాలకిషన్

కవాడిగూడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న మందకృష్ణ మాదిగ నిజ స్వరూపాన్ని మాలల సింహగర్జన ద్వారా ప్రస్ఫుటం చేశామని తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ అన్నారు. మాలల సింహగర్జన హైదరాబాద్‌లో ప్రభంజనం సృష్టించిన నేపథ్యంలో సోమవారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశామన్నారు. తెలంగాణలోని 30 నుంచి 40 లక్షల మంది మాలల శక్తి ఏకం చేసి మాలల సింహగర్జన విజయవంతం కావడంతో అన్ని రాజకీయ పార్టీలు, మందకృష్ణ మాదిగలు ఇకనైనా మాలల సత్తాను తెలుసుకోవాలని హితవుపలికారు. మాలల అభివృద్ధి కోసం వెంటనే మాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న పి.సాయిబాబా తదితరులు

సినిమా టికెట్ల ధరలు పెంచడం అన్యాయం

రాంనగర్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): సినిమా టికెట్ల ధరలు పెంచడం శోచనీయమని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. ఇటీవల విడుదలవుతున్న సినిమా టికెట్ల రేట్లు ఇష్టానుసారంగా 400 నుంచి 500 కు పైగా పెంచుకోవడానికి ప్రభుత్వం జీవోలు జారీ చేయడం విచారకరమన్నారు. సామాన్యుడికి అందుబాటులో ఉన్న వినోదం కేవలం సినిమా మాత్రమేనని దానిని కూడా సామాన్యులకు అందకుండా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. సోమవారం టీడీపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటిల్లిపాది సినిమాకు వెళ్లాలంటే 5 వేల రూపాయలకు పైగా ఖర్చు చేయాల్సి రావడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పలుస బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, యాదగిరిరావు, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

అడిక్‌మెట్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడికి మాతృవియోగం



సరోజ (ఫైల్)

రాంనగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు నగర సీనియర్ నాయకులు శ్యాంసుందర్ (చిట్టి) తల్లి మన్నె సరోజ(85) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆమెకు శ్యాంసుందర్ (చిట్టి), వెంకటేశ్వర్‌రావుతో పాటు మరో ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆమె అంత్యక్రియలు సోమవారం మధ్యాహ్నం అంబర్‌నగర్ శ్మశానవాటికలో నిర్వహించారు. ఆమె అంత్యక్రియల్లో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాజీ కార్పొరేటర్ వి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నగర సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, యువజన నాయకులు ముఠా జైసింహ, నగర నాయకులు కె మాదవ్, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, నేత శ్రీనివాస్, కె సురేందర్ బీజేపీ నాయకులు పి.సాయికృష్ణయాదవ్, శర్మ, ఆర్ నాగేష్, శేషసాయి, కౌండిన్య ప్రసాద్‌కిషోర్ ఆమె భౌతిక కాయానికి నివాళులర్పించారు.

కళారూపాలను ప్రోత్సహించాలి



నృత్యకళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేసిన అతిథులు

చిక్కడపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కళారూపాలను ప్రోత్సహించాలని విశ్రాంత న్యాయమూర్తి బూర్గుల మధుసూదన్ అన్నారు. విశ్వ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయగానసభలో ప్రపంచ నాట్య దినోత్సవం సందర్భంగా భారతీయ నాట్యకళావైభవం పేరిట వరల్డ్ రికార్డ్ నమోదు కోసం 200 నిముషాల్లో 200 మంది నాట్యకళాకారులతో శాస్త్రీయ నృత్యకళా ప్రదర్శన జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదన్ హాజరై చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. నిర్వాహకుడు డా.రంజిత్, రాజేంద్ర, మూసా అలీఖాన్, బిక్కునాథ్, వీరబోగవసంతరాయలు, భాస్కర్, రాఖీ, విజయ, మధు, ప్రశాంతి, ధరణి, రమేష్, తేజశ్రీ, అనూష, కల్పన, గోపి, నరేశ్, రవికుమార్, రంగచార్యులు, కృష్ణప్రియ, అశ్విని పాల్గొన్నారు.

● మట్టిని తొలగించాలి



రాంనగర్‌లో నాలా నుంచి తీసిన పూడికతీత మట్టిని జనప్రియ అపార్ట్‌మెంట్ పక్కన రోడ్డుపై పోశారు. 15 రోజులైనా ఆ మట్టిని తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు, ఈగల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మట్టిని తొలగించాలని జీహెచ్ఎంసీ అధికారులకు స్థానిక ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి)

జాతీయ ఐక్యతకు విద్యా విధానం దోహదం



సదస్సులో ప్రసంగిస్తున్న వినయ్ సహస్రబుద్ధే

బర్కత్‌పుర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా విధానం 2020 జాతి ఐక్యతకు విద్యా వ్యవస్థ బలోపేతానికి ఎంతో దోహదపడుతోందని ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ అధ్యక్షుడు డాక్టర్ వినయ్‌సహస్రబుద్దే అన్నారు. సోమవారం కాచిగూడలోని బద్రుకా కాలేజీలో హరిప్రసాద్ బద్రుకా స్మారకోపన్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మాతృభాషలోనే విద్యా బోధన జరగాలని, ఇది విద్యార్థులపై మంచి ప్రభావం చూపిస్తుందన్నారు. దేశంలోని భాషలు, పండగలు, సంప్రదాయాలు, విభిన్న ప్రాంతాలు, భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిబింబిస్తాయన్నారు. ప్రపంచ చరిత్రలో భారతీయ సంస్కృతికి అధిక ప్రాధాన్యం ఉందన్నారు. విద్యా సిలబస్, సంస్కృతిక, చారిత్రక, జాతీయత, అవగాహన నైపుణ్యతను పెంపొందించేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో బీపీసీఐటీ గవర్నింగ్ చైర్మన్ పద్మశ్రీ, డాక్టర్ పి.హనుమాన్‌చౌదరి, బద్రుకా విద్యా సంస్థల చైర్మన్ లక్ష్మినివాసశర్మ, కార్యదర్శి శ్రీకిషన్ బద్రుకా, సంయుక్త కార్యదర్శి రవి బద్రుకా, కోశాధికారి రాజేంద్ర, డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ అభిరామకృష్ణ, ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ కోసం నిరంతరం పోరాటం: మిద్దెపాక



మాట్లాడుతున్న మిద్దెపాక రవీందర్ తదితరులు

రాంనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏ, బీ, సీ, డీ వర్గీకరణ అమలయ్యేంత వరకూ నిరంతరం పోరాటం చేయాలని మాదిగల ఐక్య సంక్షేమ సంఘం (మాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మిద్దెపాక రవీందర్ పిలుపునిచ్చారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాదిగల రాష్ట్రస్థాయి విస్తృత సమావేశానికి ముఖ్యఅతిథులుగా రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అప్పికట్ల భరత్‌భూషణ్, బందు సొసైటీ అధ్యక్షుడు పల్లెల వీరస్వామిలు హాజరై మాట్లాడారు. మన జాతి అన్ని రంగాలలో అభివృద్ధి చెందే విధంగా క్షేత్రస్థాయి నుంచి జాతీయ స్థాయిలో జాతిని బలోపేతం చేసేందుకు కోసం భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. మనతరం కోసం కాకపోయినా ముందు తరాల కోసమైనా పార్టీలు, సంఘాలకు అతీతంగా ఒకే వేదిక మీదకు వచ్చి కృషి చేద్దామన్నారు. గూడు లేని పేదలందరికీ ఇంటి స్థలాలతో పాటు ఇంటి నిర్మాణం చేపట్టే వరకు కృషి చేద్దామన్నారు. యువతకు నైపుణ్యం శిక్షణ ఇస్తూ ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బందు సొసైటీ అధ్యక్షుడు పల్లెల వీరస్వామి, రిటైర్డ్ ఓయూ ప్రొఫెసర్ మత్తయ్య, విజయ్‌పాల్, ముత్యాల మురళీధర్, బహుజన రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు జన్ను నరసయ్య, సోషల్ జస్టిస్ ఫోరం అధ్యక్షుడు గ్యార శ్రీనివాస్, వీకేసీ రాష్ట్ర అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారం పెట్టొద్దు : డీసీపీ

సెయింట్ జోసఫ్ కాలేజీలో సైబర్ సెక్యూరిటీ సెల్ 'డిజిటల్ కేర్ హబ్' ప్రారంభం



మాట్లాడుతున్న డీసీపీ కవిత

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎట్టి పరిస్థితుల్లోనూ ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని, ఇది సైబర్‌నేరగాళ్ల చేతికి చిక్కి దుర్వినియోగం అయ్యే అవకాశముందని సైబర్ క్రైం డీసీపీ కవిత దార అన్నారు. కింగ్‌కోఠిలోని సెయింట్ జోసఫ్ డిగ్రీ, పీజీ కాలేజీలో సోమవారం వరల్డ్ కంప్యూటర్ లిటరసీ డే సందర్భంగా హైదరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సహకారంతో 'డిజిటల్ కేర్ హబ్' పేరుతో సైబర్ సెక్యూరిటీ సెల్, డిజిటల్ సేఫ్టీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ వేధింపులు, ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ డెలివరీ మోసాలు, ఫిషింగ్, డిజిటల్ అరెస్ట్ వంటి సైబర్ నేరాల గురించి ఉదాహరణలతో వివరించారు. సైబర్ నేరాలు జరుగుతున్న తీరుపై అవగాహన పెంచుకోవడంతో పాటు బలమైన పాస్‌వర్డ్‌లు పెట్టుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు. కంప్యూటర్ సైన్స్ హెడ్ కిరణ్‌జ్యోతి, అదనపు ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఎస్.శ్రీకాంత్, ప్రిన్సిపాల్ ఆంటోని సాగయరాజా, హైదరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ అసోసియేట్ డైరెక్టర్ శీమాస్క్రీ పాల్గొన్నారు.